Digital, tmedia.net.in

టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఆదివారం 11/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

సీపీఎం నేత గఫూర్ ఇంట్లో విషాదం

గుండెపోటుతో కుమారుడు మృతి



టీ మీడియా,అక్టోబర్10, హైదరాబాద్ బ్యూరో : కర్నూలు మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నేత యంఏ గఫూర్ కుమారుడు పీవీ కిరణ్ అమెరికాలో మృతి చెందారు. అక్టోబర్ 1న గుండెపోటుతో నిద్రలోనే మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాలిఫోర్నియాలో సాఫ్ట్?వేర్ ఇంజినీర్‌గా కిరణ్ పని చేస్తున్నారు. అపార్ట్?మెంట్‌లో ఒంటరిగా ఉన్న కిరణ్ ఒకటో తేదీ రాత్రి అనారోగ్యానికి గురయ్యారు. గమనించిన అపార్ట్?మెంట్ మేనేజర్ ఆసుపత్రికి తీసుకుని వెళ్లినట్లు మాజీ ఎమ్మెల్యే గఫూర్ తెలిపారు.

అయితే ఈ విషయం తమకు తెలియదని చెప్పారు. కిరణ్ డ్యూటీకి రాకపోవడంతో కంపెనీ ప్రతినిధులు స్నేహితులకు సమాచారం ఇచ్చారన్నారు. వారి ద్వారా తమకు సమాచారం వచ్చిందని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. నాయకులు, ప్రజాప్రతినిధులు గఫూర్, నిర్మలమ్మ దంపతులను పరామర్శిస్తున్నారు. గఫూర్ కుమారుడి మరణం పట్ల సీపీఎం పార్టీ సంతాపం తెలిపింది. మృతదేహం కర్నూలుకు తీసుకురావడానికి నాలుగు రోజుల సమయం పడుతుందని సమాచారం.

నలుగురు మాజీ సీఎంలు, 7వేల మంది అరెస్ట్

- ఉద్రిక్తతకు దారితీసిన నిరసన
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్

టి మీడియా , అక్టోబర్10, ఢిల్లీ బ్యూరో : : దేశ రాజధానిలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్?కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన వేలాది మందిని పోలీసులు అడ్డుకున్నారు. నిరసన చేపట్టేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు పలువురు ఇండీ కూటమి నేతలు, వామపక్ష నాయకులు, సామాజిక కార్యకర్తలను నిర్బంధించారు. మరోవైపు, జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన 7వేల మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు. ముందస్తు చర్యల్లో భాగంగా నేర చరిత్ర ఉన్న 600 మందికిపైగా వ్యక్తులను కూడా నిర్బంధించినట్లు తెలిపారు.

దీపేంకు విమానంలోనే!

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపేంకు పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిరసనలో పాల్గొనేందుకు ముంబయి నుంచి దిల్లీకి వచ్చిన ఆయనతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అందుకు సంబంధించిన దృశ్యాలను సీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తమ నాయకులను నిరసన ప్రదేశానికి వెళ్లకుండా ముందస్తు ప్రణాళికతో అడ్డుకున్నారని పార్టీ ఆరోపించింది. ఇది పౌర హక్కులను ఉల్లంఘించడమేనని విమర్శించింది.

కేజ్రీవాల్, మమతా బెనర్జీ నిర్బంధం

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన నివాసం నుంచి జంతర్‌మంతర్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో ఆప్ కార్యకర్తలు పోలీసులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కేజ్రీవాల్‌ను ఎత్తుకుని బస్సు వద్దకు తీసుకెళ్లారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, దిల్లీ పార్టీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ సహా పలువురు నేతలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా



మిగతా 2వ పేజీలో..

నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి

- అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌చార్జ్ మంత్రులదే
- స్థానిక ఎన్నికలకు ముఖ్యమంత్రి చంద్రబాబు డెడ్‌లైన్



టి మీడియా , అక్టోబర్10, అమరావతి బ్యూరో : స్థానిక ఎన్నికలకు ముఖ్యమంత్రి చంద్రబాబు డెడ్‌లైన్ ఫిక్స్ చేశారు. గెలుపు టార్గెట్ 100 శాతంగా నిర్ణయించారు. నవంబర్ 15 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి, పాలనపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్ల నుంచి కూటమి పార్టీల సమన్వయం వరకు ఎన్నికల వ్యూహంపై కీలక సూచనలు చేశారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొంటూనే నియోజకవర్గాల అభివృద్ధికి నిధుల విడుదలపైనా కీలక ప్రకటన చేశారు.కేబినెట్ భేటీ ముగిశాక సహచర మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చలు జరిపారు. స్థానిక సంస్థల ఎన్నికలే అజెండాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సన్నద్ధత, బీసీ రిజర్వేషన్లు, రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను మంత్రులు, ఎమ్మెల్యేలు సీరియస్‌గా తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని సూచించారు. ఈ ఎన్నికల ద్వారా కొత్త నాయకత్వం తెరపైకి వస్తుందని స్పష్టం చేశారు. కూటమిలోని మూడు పార్టీల మధ్య సమన్వయమే ఎన్నికల్లో కీలకమని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మంత్రులు పరస్పరం సంప్రదింపులు జరుపుతూ ముందుకు వెళ్లాలని సూచించారు. కూటమి అభ్యర్థుల

మిగతా 2వ పేజీలో..

15 ఏళ్ల ఉద్యోగ జీవితం.. రూ.40 కోట్ల అక్రమాస్తులు



టి మీడియా , అక్టోబర్10, ఖమ్మం : ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే కారణంతో పౌర సరఫరాల సంస్థ మహబూబాబాద్? జిల్లా మేనేజర్ వాసంశెట్టి నరసింహారావును అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఏసీబీ డీఎస్పీ రమేశ్? ఆధ్వర్యంలో ఏడు బృందాలుగా ఏర్పడ్డారు. ఏకకాలంలో ఖమ్మంలోని నరసింహారావు నివాసంతో పాటు నేలకొండపల్లి, మహబూబాబాద్, గరిడేపల్లి, హైదరాబాద్?లోని ఎల్బీనగర్? తదితర ఏడు ప్రాంతాల్లో అతని కుటుంబసభ్యులు, బంధువులు, బినామీల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు.తన 15 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో వేతనం ప్రకారం రూ. 48 లక్షల ఆస్తులు సంపాదించుకోవచ్చని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఆయన రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం రూ. 9.41 కోట్ల ఆస్తులు

మిగతా 2వ పేజీలో..



ఆ రైళ్లలో సామాన్యులకి నిత్య నరకం

లగేజీతో పాటు బకెట్లతో నీళ్లు తీసుకెళ్లాల్సిందేనా?

టీ మీడియా,అక్టోబర్10, అమరావతి బ్యూరో : కొన్ని రైళ్ల మరుగుదొడ్లలో కుళాయిల నుంచి నీళ్లు రాక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా విశాఖ నుంచి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాటిల్లో ఈ సమస్య తరచూ తలెత్తుతోంది. కొన్ని బోగీల్లోనే నీరు అందుబాటులో ఉండి కొన్నింటిలో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు నీళ్ల సీసాలు కొనుగోలు చేసి వినియోగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విశాఖ నుంచి మహబూబ్‌నగర్ (12861) వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఇటీవల ప్రయాణికులు నీళ్ల కోసం అవస్థలు పడాల్సి వచ్చింది. ఈ నెల అయిదున విశాఖలో బయలుదేరిన ఈ రైలు అనకాపల్లి దాటక ముందే పలు బోగీల్లోని మరుగుదొడ్లలో తగినంత నీరు లేని విషయం ప్రయాణికులు గుర్తించారు. కనీసం చేతులు కడుక్కోవడానికైనా లేవు. దీంతో అత్యవసరాలు తీర్చుకోవడానికి ఒక బోగీ నుంచి మరో బోగీలోకి తిరగాల్సి వచ్చింది. దీంతో మహిళలు, వృద్ధులు, పిల్లలు చాలా ఇబ్బంది పడ్డారు. కొందరు స్టేషన్లలో నీళ్ల సీసాలు కొనుగోలు చేసి మరీ అవసరాలు తీర్చుకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. చివరికి కొందరు రైల్వే అత్యవసర సేవలకు ఫిర్యాదు చేసి నీళ్లు ఎక్కడ అందుబాటులోకి

మిగతా 2వ పేజీలో..

విద్యుత్ సమస్య ఉంది

పొదుపుగా వాడుకోండి : రేవంత్ రెడ్డి




టి మీడియా , అక్టోబర్10, హైదరాబాద్ బ్యూరో : విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందన్న సీఎం రేవంత్? రెడ్డి అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులపై సీఎస్, సీఎంవో ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమీక్షలో నరేందర్‌రెడ్డి, రామకృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ ఆనంద్ పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

ఎల్‌నినో వల్ల భవిష్యత్‌లో తీవ్ర సంక్షోభం ఎదుర్కోవాల్సి ఉందని, వచ్చే జూన్ వరకు సాగు, తాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యలపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదని, ఉత్పత్తి అవుతున్న కరెంట్?ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యుత్ ఆధారిత పనులను

మిగతా 2వ పేజీలో..

ఒరిజినల్ మీ దగ్గరే
డూప్లికేట్ పేపర్లతో స్థలం మార్టిగేజ్



టి మీడియా , అక్టోబర్10, హైదరాబాద్ బ్యూరో : తక్కువ ధరకు స్థలం వస్తుందని ఊరు శివార్లలో స్థలం కొని అక్కడ పడేశారా ఎందుకైనా మంచిది ఒకసారి వెళ్లి చూసుకోండి. ఎప్పుడో పాతిక, ముప్పై ఏళ్లనాడు ఆస్తి కొనేసి అమెరికా వెళ్లిపోయారా మీ ప్రాపర్టీపై ఆశలు వదులుకోవాల్సిందే. పత్రాలు మన దగ్గరే ఉన్నాయి. ఆస్తి ఎక్కడికి పోతుందులేనని నిశ్చింతగా ఉన్నారా? మీ కళ్లే మిమ్మల్ని నమ్మలేనంతగా నకిలీ పత్రాలు వారి చేతుల్లో ఉంటాయి. రెండింటిని పక్కపక్కన పెడితే ఏదీ మీదో కూడా మీరు పోల్చుకోలేరు.అసలు మీ చేతుల్లో ఉన్న పత్రాలతో పనేలేదు. ఎందుకంటే ఇప్పటికే ఆ స్థలం ముగ్గురు, నలుగురు చేతులు మారిపోయి ఉంటుంది. మీరు కోర్టుకు వెళ్లినా నిరూపించుకోలేనంతగా అధికారుల సంతకాలు సైతం ఫోర్జరీ చేసి కోట్ల విలువైన స్థలాలు కొట్టేస్తున్నారు. మార్ట్‌గేజ్ ఆస్తులను విడిపించి ఇష్టానుసారం అమ్ముకుంటున్నారు. దీనికోసం ఏకంగా నకిలీ అధికారులతో వేషాలు వేయించడం సంతకాలు ఫోర్జరీ చేయడం, దొంగ స్టాంప్‌లు సృష్టించడం చేస్తున్నారు.

సులభంగా డబ్బులు సంపాదించాలని

కాకినాడకు చెందిన దేవగుప్తపు వెంకట సత్యనారాయణ హైదరాబాద్ ఎల్బీనగర్‌లో ఉంటున్నాడు. గతంలో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై మంచి అవగాహన ఉంది. సరూర్‌నగర్‌కు చెందిన పోలె జనార్ధన్‌తో కలిసి ఇక్కడే ఓ మీసేవా కేంద్రం నిర్వహించాడు. ఇద్దరూ కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలన్న కాంక్షతో నకిలీ పత్రాల

మిగతా 2వ పేజీలో..

నలుగురు మాజీ సీఎంలు, 7వేల మంది అరెస్ట్

కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని ప్రధాని మోదీపై ఆరోపణలు చేశారు. దేశ యువత మేల్కొందని, అన్యాయానికి భయపడబోరని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

వామపక్ష నేతలూ అదుపులోకి

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, వామపక్ష నేత బృందా కారత్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేరళ భవన్ బయట నుంచి జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో వారిని అడ్డుకున్నారు. పోలీసుల చర్యకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. విజయన్ ఈ ఘటనపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ప్రతిపక్ష నేతలను చూసి భయపడుతున్నందుకే పోలీసులు ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకుని, గంటపాటు వాహనాల్లో తిప్పారని విమర్శించారు.ప్రజాస్వామ్య హక్కులపై ఇలాంటి చర్యలతో తమను భయపెట్టలేరని పేర్కొన్నారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దిల్లీని పోలీసు శిబిరంగా మార్చినప్పటికీ నిరసనల్లో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారని దీపాంకర్ భట్టాచార్య అన్నారు. ఒక ప్రాంతంలో నిరసనను అడ్డుకున్నా, ఉద్యమ స్ఫూర్తిని ఆపలేరని వ్యాఖ్యానించారు.

నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి

గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని తేల్చిచెప్పారు. ఏ ఒక్క స్థానాన్ని కోల్పోవడానికి వీల్లేదని, అన్ని స్థానాల్లోనూ విజయం సాధించేలా సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు.

పార్టీ పరంగా సాధ్యమైనంత ఎక్కువ రిజర్వేషన్లు

బీసీ రిజర్వేషన్ల అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికలోని వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా వైఎస్సార్సీపీ అడ్డంకులు సృష్టిస్తోందని చంద్రబాబు విమర్శించారు. గతంలో బీసీలకు అమలైన 34 శాతం రిజర్వేషన్లను జగన్ ప్రభుత్వం తగ్గించిందని, హైకోర్టు కొట్టివేసిన జీవోలపై సుప్రీంకోర్టును ఆశ్రయించలేదని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్ల కోసం ప్రయత్నిస్తుంటే వైఎస్సార్సీపీ కోర్టును ఆశ్రయించిందని ఆక్షేపించారు. వైఎస్సార్సీపీ న్యాయస్థానాన్ని ఆశ్రయించకుండా ఉంటే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవని వ్యాఖ్యానించారు.బీసీలకు పార్టీల పరంగా సాధ్యమైనంత ఎక్కువ రిజర్వేషన్లు కల్పించాలని చంద్రబాబు సూచించారు. ఎస్ఐఆర్ తర్వాత వెలువడే ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహించాలని జగన్ కోర్టును ఆశ్రయించడంపై సీఎం విమర్శలు చేశారు. ఓటమి భయంతోనే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా పరిషత్‌ల సంఖ్య పెరిగినందున జడ్పీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు కొత్త రోస్టర్ రూపొందించాల్సిన అవసరం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం

ఎల్‌నినో పరిస్థితులపై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం ఉన్నప్పటికీ గత ఏడాది నీటిని నిల్వ చేసుకోవడం వల్ల ఈ ఏడాది కొంతవరకు ఇబ్బందుల నుంచి బయటపడగలిగామని వివరించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు.పాలనలో మంత్రులు మరింత చురుగ్గా వ్యవహరించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రేక్షకుల్లా ఉండిపోకుండా కొత్త విషయాలు నేర్చుకుంటూ పాలనా వ్యవహారాలపై పట్టు పెంచుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత శాఖల మంత్రులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని సాధించాలని ఆదేశించారు. కేంద్రంతో సమన్వయం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన వనరులను సమీకరించుకోవాలని దిశానిర్దేశం చేశారు.నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద ఒక్కో నియోజకవర్గానికి కోటి రూపాయల చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. సోమ, మంగళవారాల్లో ఈ నిధులను విడుదల చేస్తామని తెలిపారు. దీంతో స్థానికంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులోకి రానున్నాయి..

విద్యుత్ సమస్య ఉంది

తాత్కాలికంగా వాయిదా వేస్తే మంచిదని సూచించారు.

చుక్క నీరు కూడా వృధా కాకూడదు

ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావంపై , సినిమా, మీడియా, వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

15 ఏళ్ల ఉద్యోగ జీవితం.. రూ.40 కోట్ల అక్రమాస్తులు

కూడగట్టుకున్నట్లు గుర్తించారు. వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.40 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

గతంలో రెండుసార్లు సస్పెండ్

డీఎస్పీ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం, సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలానికి చెందిన వాసంశెట్టి నరసింహారావు 2011లో సివిల్? సప్లై సంస్థలో ఉద్యోగంలో చేరారు. ఆరు నెలల నుంచి మహబూబాబాద్? జిల్లాలో అసిస్టెంట్? టెక్నికల్ మేనేజర్?, జిల్లా మేనేజర్? (డీఎం)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే గతంలో నిర్మల్?, ఖమ్మం, వరంగల్? జిల్లాల్లో పని చేసినప్పుడు ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. పైగా గతంలో రెండుసార్లు సస్పెండ్ కూడా అయ్యారు.

బహిరంగ మార్కెట్?లో రూ.40 కోట్లకు పైనే

అయితే తాజాగా మరోసారి ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేయగా అతనితో పాటు భార్య, మామ, బినామీలపై ఉన్న అక్రమ ఆస్తులు బయటపడ్డాయి. తనిఖీల్లో ఒక కారు, 331.58 గ్రాముల బంగారం, కొన్ని వెండి ఆభరణాలు, రూ.15,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటికి స్థిరాస్తులను కలిపితే బహిరంగ మార్కెట్?లో వాటి మొత్తం విలువ రూ.40 కోట్లకు పైనే ఉంటుందని అధికారులు వివరించారు. నరసింహారావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆయన బినామీలపైనా చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యవసాయ భూములు, బంగ్లాలు

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బల్లెపల్లి, వెలుగుమట్లలో ఐదు ఇళ్ల స్థలాలు (1,230.16 చదరపు గజాలు), ఖమ్మంలో జీం2, జీం4 హైదరాబాద్? ఎల్బీనగర్? బైరామల్?గూడలో జీం2 భవనాలు.సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండలో 21.30 ఎకరాలు, నామవరంలో 5.31 ఎకరాలు, గరిడేపల్లి మండలం కల్మలచెరువులో 1.08 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది.

ఒరిజినల్ మీ దగ్గరే

డూప్లికేట్ పేపర్లతో స్థలం మార్టిగేజ్

దందాకు తెరలేపారు. యూసఫ్‌గూడకు చెందిన మహమ్మద్ జహీర్ అహ్మద్, గులాం మహ్మద్‌ఖాన్‌తో ఒప్పంద కుదుర్చుకున్నారు. వీరు మార్టిగేజ్ నుంచి ఆస్తిని విడిపించుకోవాలనుకునే వారికి గాలం వేస్తారు. మొత్తం పని తామే చూసుకుంటామంటూ వారిని నమ్మించి సత్యనారాయణ దగ్గరకు తీసుకొస్తారు. ఇక అక్కడ నుంచి అసలు కథ మొదలవుతుంది.

ఫోర్జరీ సంతకాలు చేసి, నకిలీ స్టాంప్‌లు

కొత్తపేటకు చెందిన చెడీల శివనాగేశ్వరరావును జీహెచ్?ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారిగా, యెంపల్లి మహిపాల్‌రెడ్డిని హెచ్?ఎండీఏ అధికారిగా చూపించి వారిని నమ్మిస్తారు. మరో ఇద్దరిని సాక్షులుగా నియమిస్తారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తనఖాలో ఉన్న మీ ఆస్తులు విడిపిస్తామని చెబుతారు. అధికారుల పేర ఫోర్జరీ సంతకాలు చేసి, నకిలీ స్టాంప్‌లు వేసి మార్టిగేజ్ రిలీజ్ డీడ్లు, జీపీఏలు, సేల్ డీడ్లు వంటి నకిలీ ప్రత్రాలు సృష్టిస్తున్నారు. అనంతరం వాటి ద్వారా స్థలాలను ఒకరి తర్వాత మరొకరికి అమ్మేస్తున్నారు. అలాగే ఏళ్ల తరబడి ఖాళీగా స్థలాలపై కన్నేసి వాటికి నకిలీ ప్రత్రాలు సృష్టించి యజమానులకు తెలియకుండానే ఇతరులకు అంటగట్టేస్తున్నారు.

ఎల్బీ నగర్ పరిధిలోనే దందా

ఇప్పటి వరకు కోట్ల విలువ చేస్తే ఆస్తులను నకిలీ పత్రాలు సృష్టించి మార్టిగేజ్ నుంచి విడిపించినట్లు నాటకమాడి ఇతరులకు అమ్మేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. హయత్‌నగర్ సమీపంలోని పసుమాములలో 1250 చదరపు గజాలతో పాటు బాటసింగారంలో ఏకంగా 6 వేల చదరపు గజాల స్థలానికి నకిలీ మార్టిగేజ్ పత్రాలు సృష్టించి ఆస్తులను విడిపించినట్లు పోలీసులు గుర్తించారు.

ప్రధాన నిందితునిపై గతంలోనూ కేసులు

ఎల్బీనగర్‌లోని ఓ ఇంట్లో నకిలీ పత్రాలు తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఎస్?వోటీ పోలీసులు దాడి చేసి సత్యనారాయణతోపాటు మరో నిందితుడిన్?పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. నకిలీ పత్రాలు, స్టాంప్‌లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సత్యనారాయణపై ఇప్పటికే 10 కేసులు ఉన్నాయి. ఆస్తులు కొనేప్పుడు అన్ని విధాల విచారణ చేసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.నకిలీ పత్రాల వ్యవహారం భయటపడటంతో వీరిని నమ్మి స్థలాలు కొనుగోలు చేసిన వారంతా ఆందోళన చెందుతున్నారు. అలాగే ఇది కేవలం వీళ్లకే పరిమితం కాలేదని ఇలాంటి ముఠాలు హైదరాబాద్‌లో చాలా ఉన్నాయని పోలీసులు తెలిపారు. వారందరినీ పట్టుకుంటామని హెచ్చరించారు.

ఆ రైళ్లలో సామాన్యులకి నిత్య నరకం

వస్తాయో తెలుసుకోవాల్సి వచ్చింది.

మధ్యలో నీటిని నింపే అవకాశం లేదు

విశాఖ నుంచి బయలుదేరే రైళ్లలో బోగీలకు ఇక్కడే నీటిని నింపుతారు. సాధారణంగా 300 కిలోమీటర్ల వరకు నీటి కొరత ఉండకూడదు. గతంలో ఈ రైలుకు విజయవాడలో మళ్లీ నింపేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో చిక్కులు వస్తున్నాయి. ఈ రైలు విజయవాడకు కాకుండా రాయనపాడు (బైపాస్) మీదుగా కాజీపేట వైపు వెళ్లడంతో మధ్యలో నీటిని నింపే అవకాశం లేదని సమాచారం. ఈ సమస్యకు రైల్వే అధికారులు ప్రత్యామ్నాయం ఆలోచించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా రాజమహేంద్రవరం వంటి ప్రధాన స్టేషన్లలో నింపే అవకాశం కల్పిస్తే సమస్యకు కొంత పరిష్కారం లభిస్తుందని ప్రయాణికులు సూచిస్తున్నారు.

లగేజీతో పాటు రెండు బకెట్ల నీళ్లు

విశాఖలో నీరు నింపిన తరువాత త్వరగా అయిపోతే ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తుండటంతో కొందరు సిబ్బంది బోగీలకు నీరొచ్చే వాల్వ్‌లను ఆపేసి పొదుపు చర్యలు పాటిస్తున్నారు. తర్వాత ఎవరైనా అడిగితే అవసరమైన సమయంలో అందుబాటులోకి తెస్తున్నారు. ఈ నెల 5న సమస్య ఏర్పడినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కావాలనే నీటి సరఫరా ఆపినట్లు సమాచారం. పర్యవేక్షణాధికారులు ఫిర్యాదుల నుంచి తప్పించుకునేందుకు ఈ రకమైన చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ రైలులో తరచూ ఈ సమస్య తలెత్తుతుండటంతో ప్రయాణికులు లగేజీతో పాటు రెండు బకెట్ల నీళ్లు కూడా తీసుకువెళ్లాలంటూ సామాజిక మాధ్యమాల్లో చర్చించుకుంటున్నారు.

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

పూలను పేర్చి ఆటపాటలతో సందడి



టి మీడియా , అక్టోబర్10, హైదరాబాద్ బ్యూరో : రాష్ట్రంలో బతుకమ్మ సంబురాలు మొదలయ్యాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. రకరకాల పూలతో, సాంప్రదాయ దుస్తులతో మహిళలు, చిన్నారులు బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. మహిళలు సహజసిద్ధమైన తీరొక్క పూలతో ఇంటింటా బతుకమ్మను పేర్చి పసుపు, కుంకుమలతో గౌరమ్మను చేసి భక్తిశ్రద్ధలతో కొలుస్తారు.తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఆ తర్వాత వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్ద పప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయి. ఇలా రోజుకొక్క పేర్లతో పిలుచుకుంటూ బతుకమ్మలు తయారు చేసి గౌరీ దేవికీ రోజుకొక రకంగా పిండివంటలు నైవేద్యంగా సమర్పిస్తారు. చివరిరోజు సద్దుల బతుకమ్మను రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తారు.

బతుకునిచ్చే పండుగ

తంగేడు, గునుగు, కట్ల, గుమ్మడి మొదలైన పూలతో చేసిన బతకుమ్మలు నేటి నుంచి ఇంటింటా కనువిందు చేస్తాయ్. పెళ్లైన పడతులు పుట్టింటికి వచ్చి ఆనందంగా జరుపుకునే పండుగ ఇది. ఇళ్ల ముంగిళ్లలోనూ ఆలయాలు కూడళ్ల వద్దా, చెరువు గట్టల వద్దా బతుకమ్మలను ఒక్క చోటుకు చేర్చి పాటలు పాడి నృత్యాలు చేస్తారు

పూలను పేర్చి ఆటపాటలతో సందడి

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంతో పాటు వరంగల్, హనుమకొండ, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్ తదితర చోట్ల పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు ఒక్క చోట చేరి తీరొక్క పూలతో బతుకమ్మను అందంగా పేర్చి చప్పట్లు కొడుతూ చుట్టూ తిరుగుతూ ఆడి పాడారు. బతుకమ్మ నిర్వహణ కోసం పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. పండగ జరిగే ప్రాంతాలు, ఘాట్లు, మైదానాలకు వెళ్లే రహదారుల మరమ్మతుతో పాటు విద్యుత్, తాగునీరు అందుబాటులో ఉంచారు.మెదక్ జిల్లాలో పలు గ్రామాలలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం, బాలాజీ మఠం, హౌసింగ్ బోర్డు తదితర కాలనీల్లో మహిళలు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడి పాడారు.

రహదారి పనులను ప్రారంభించాలని సిపిఎం రాస్తారోకో

టీ మీడియా,అక్టోబర్10, వెంకటాపురం: ప్రధాన రహదారి కొత్త రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శనివారం నాడు బోధపురం సిపిఎం శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా ప్రధాన రహదారి దారుణంగా మారి నేపథ్యంలో రెండు సంవత్సరాలుగా సిపిఎం పార్టీ ప్రజలు అనేక ఆందోళన ఉద్యమాలు చేపట్టిన నేపథ్యంలో ఎట్టకేలకు ప్రభుత్వం 47 కోట్ల రూపాయలు మంజూరు చేసి టెండర్లు పూర్తి చేసి నెలలు కావస్తున్న పనులను ఇంకా ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు కూడా పనులను ప్రారంభించకుండా నిమ్మకు నీరెత్తినట్టు వివరిస్తున్నారని విమర్శించారు రోడ్లు గుంతల మయం అవ్వడంతో గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, విద్యార్థులు, అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఇసుక లారీలను నిలుపుదల చేయాలని సుమారు నాలుగు గంటల పాటు ఆందోళన చేసిన నేపథ్యంలో నిలుపుదల చేసిన జిల్లా అధికార యంత్రాంగం మరల తిరిగి గత కొద్ది రోజుల నుండి ఎందుకు అనుమతులు ఇచ్చిందో మండల ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారుచర్ల ఇసుక లారీలను వెంటనే నిలుపుదల చేయాలని ఆయన కోరారు, ఇసుక లారీల వల్ల మండల కేంద్రంతో పాటు, ఆలుబాక, భోదాపురం గ్రామాలలో దుమ్ము ధూళితో ప్రజలు వ్యాపారస్తులు శ్వాసకోశ వ్యాధులకు గురి అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, వాటర్ ట్యాంకర్ల ద్వారా పై గ్రామాలలో రోడ్లను తడిపించాలని కోరారు సంఘటన స్థలానికి చేరుకున్న వెంకటాపురం ఎస్సై కే తిరుపతిరావు నాయకులతో చర్చించి, ఆర్ అండ్ బి,టి ఎస్ ఎం డి సి ఉన్నత అధికారులతో ఫోన్లో మాట్లాడి వారం రోజులలో కొత్త రోడ్ల పనులను ప్రారంభిస్తారని, దుమ్ముదులికి చర్యలు చేపడతారని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు

గరీబ్‌పేట లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

టీ మీడియా,అక్టోబర్10, సుజాతనగర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు సుజాతనగర్ మండల పరిధిలోని గరీబ్‌పేట గ్రామంలోశనివారం తెల్లవారుజామున 04:00 గంటల నుంచి 07:00 గంటల వరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 68 ద్విచక్ర వాహనాలు, 19 త్రిచక్ర వాహనాలను గుర్తించి, మొత్తం 87 వాహనాలపై చట్టప్రకారం జరిమానాలు విధించారు. అదేవిధంగా 30 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్థులతో మాట్లాడుతూ, గంజాయి, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు తగిన పర్యవేక్షణ వహించాలని కోరారు. కోడిపందాలు, పేకాట, జూదం, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఓటీపీ, యూపీఐ మోసాలు, నకిలీ ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు



చేయాలని తెలిపారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో సిఐలు యాసీన్, వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, శ్రీలక్ష్మి, పోలీస్ అధికారులు, సుమారు 120 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ వైజర్ వేధింపులపై కార్మికుల నిరసన

•టీ మీడియా, అక్టోబర్ 10, రామకృష్ణాపూర్;



క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ సూపర్ వైజర్ శ్రీనివాస్ వేధింపులపై క్యాతనపల్లి మున్సిపల్ కార్మికులు శనివారం విధులను బహిష్కరించారు. సూపర్ వైజర్ అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని పలుమార్లు కమిషనర్, వైర్ పర్సన్ కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శులు సాంబారి వెంకటస్వామి, కాసర్ల ం ు నియమించాలని కార్మికులు డిమాండ్ చేశారు.మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ కార్మికులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్, యూనియన్ నాయకులు మహేందర్, రమేష్ పాల్గొన్నారు.

తగాదాల పరిష్కారం పేరుతో రూ.15 వేలు వసూలు

•-కేసు నమోదు- రిమాండ్‌కు

టీ మీడియా, అక్టోబర్ 10, దమ్మపేట:కుటుంబ తగాదాలను పరిష్కరిస్తానని నమ్మించి రూ.15 వేల నగదు తీసుకున్నారనే ఆరోపణలపై షేక్ జాన్ బీ (47)పై దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితురాలిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు సమాచారం.వివరాల్లోకి వెళితే.. అశ్వారావుపేటకు చెందిన షేక్ సమ్రీన్ కుటుంబ సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో పోలీసులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని చెప్పి షేక్ జాన్ బీ రూ.15,000 తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది.ఈ వ్యవహారంపై అందిన ఫిర్యాదు మేరకు దమ్మపేట ఎస్ఐ బాలస్వామి ఎన్ఎస్ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు సమాచారం. అనంతరం నిందితురాలిని అదుపులోకి తీసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిసింది.కుటుంబ సమస్యలను పరిష్కరిస్తామంటూ డబ్బులు తీసుకునే వారి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైనప్పుడు నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

పరిశుభ్రతతో రోగాలకు చెక్

•డీవైసీఎంఓ మధుకుమార్



టీ మీడియా, అక్టోబర్ 10, రామకృష్ణాపూర్;
క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో డీవైసీఎంఓ (అడ్మిన్) డాక్టర్ మధుకుమార్ ఆధ్వర్యంలో శనివారం చేతుల పరిశుభ్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైసిఎంఓ మాట్లాడుతూ వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు, పారిశుధ్య కార్మికులతో సహా ప్రతి ఒక్కరూ చేతుల పరిశుభ్రత పాటించాలని, దీనివల్ల వ్యాధులు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చని అన్నారు. చేతులు కడుక్కునే విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు.జీఎం రాధాకృష్ణ సహకారం, సీఎంఓ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ ఆదేశాలతో జరిగిన ఈ కార్యక్రమంలో మ్యాట్రన్ విజయకుమారి, సీనియర్ పీఓ మాథర్ సాహెబ్, ఓఎస్ కృష్ణమూర్తి, శానిటరీ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊర్స్ ఉత్సవాలలో లంగర్ పంపిణీ



టీ మీడియా, అక్టోబర్ 10 పెబ్బేరు: వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని మున్సిపల్ ఆఫీసు దగ్గర నున్న హజరత్ షేక్ అలీషా (తిక్క తాతయ్య) 40 వ ఊర్స్ లో దర్గాను విద్యుత్ దీపాలతో పూల మాలలతో అందంగా అలంకరించారు ఉత్సవాలలో భాగంగా శనివారం పట్టణ ప్రజలందరికీ దర్గా దగ్గర (లంగర్)అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని దర్గా కమిటీ సభ్యులు అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణ



•మరింత గడువు కోరిన రాష్ట్ర ఎన్నికల అధికారి

టీ మీడియా,అక్టోబర్10, అమరావతి బ్యూరో : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును పొడిగించాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ భారత ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. 2 వారాల పాటు పొడిగింపు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం అమల్లో ఉన్న షెడ్యూల్ ప్రకారం నోటీసుల జారీ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార గడువు నేటితో ముగుస్తోంది.
ం ు ం ు ం ు తుది ఓటర్ల జాబితా ఈ నెల 16న ప్రచురించాల్సి ఉంది. అయితే ముసాయిదా జాబితా విడుదలకు ముందే తొలగించిన, ముసాయిదా జాబితా విడుదల తర్వాత అనర్హులుగా గుర్తించిన దాదాపు 46.62 లక్షల ఓటర్ల వివరాలను పునఃపరిశీలించాలని, ఇందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. కొత్తగా ఓటు హక్కు నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన ఫారమ్-6, 7, 8ల పరిష్కారం ఇంకా పూర్తి కాకపోవడంతో వివిధ రాజకీయ పక్షాల నుంచి అందిన వినతుల మేరకు సర్ గడువును పొడిగించాలని ఈసీఐని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కోరారు. నేడు దీనిపై నిర్ణయం వెలువడే అవకాశముంది.

యాంత్రికంగా స్క్రీనింగ్
ప్రస్తుతం ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం 'సర్' ప్రక్రియలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగిస్తోంది. ఓటర్ల డేటాను యాంత్రికంగా స్క్రీనింగ్ చేస్తున్న క్రమంలో ఎలాంటి కారణం లేకుండానే లక్షలాది ఓటర్లకు కూడా నోటీసులు వెళ్లాయి. దీంతో సర్వత్రా గందరగోళం నెలకొంది. ఎన్యూమరేషన్ ఫారాల్లో తప్పులు దొర్లడమే అందుకు ప్రధాన కారణం. తప్పులు సరిచేసుకోవడానికి నోటీసులు జారీ చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా పేర్లలో తేడాలు, పాత, కొత్త జాబితాల్లో ఓటరు పేరు లేదా తండ్రి/భర్త పేరు స్పెల్లింగుల్లో తేడాలు ఉన్న వారికి నోటీసులు అందుతున్నాయి.

ఫామ్-7 ను ఓటరే స్వయంగా
ఓటు తొలగించడానికి ఫామ్-7ను ఓటరే స్వయంగా సమర్పించాల్సి ఉంటుంది. జాబితాలో ఇప్పటికే నమోదై ఉన్న అదే నియోజకవర్గానికి చెందిన ఏ ఓటరైనా తన నియోజకవర్గ పరిధిలో మరొకరి ఓటుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫామ్-7 సమర్పించవచ్చు. ఇదే అదనుగా కొన్ని ప్రాంతాల్లో ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించడానికి ప్రత్యర్థులు ఫామ్ 7 సమర్పిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగుల మౌన దీక్ష కు యూ టీ యఫ్ మద్దతు



టీ మీడియా,అక్టోబర్10.,చింతూరు:మౌన పోరాట దీక్ష ఐదవ రోజుకు చేరింది. దీక్షకు యుటిఎఫ్ టీచర్లు మద్దతు ఇచ్చారు ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు వైద్య ఆరోగ్య ఉద్యోగులు జేఏసీ పిలుపుమేరకు నిరసనలో భాగంగా ఐదవ రోజున మౌన దీక్ష చేపట్టం జరిగింది. గత నెల రోజుల ముందు నుండి ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు తీసుకొని వెళ్లినప్పటికీ, ఐదు దపాలుగా చర్చలకు పిలిచారు.కానీ,ఆ చర్చలు విఫలం అయినందున, ముకుమ్మడిగా విధులు బహిష్కరించి తమ న్యాయమైన డిమాండ్లను ఎలక్ట్రానిక్ మీడియా,ప్రింట్ మీడియా, పబ్లిక్ కు తెలియజేయడం జరిగిందన్నారు.మొదటి డిమాండ్ రెగ్యులరైజేషన్, రెగ్యులర్ చేయని పక్షంలో అప్పటివరకు 100% గ్రాస్ శాలరీ ఇవ్వాలని కోరడమైనది. ఉద్యోగరీత్యా ఎవరైనా విధి నిర్వహణలో మరణిస్తే ఆ కుటుంబానికి 50 లక్షలు ఎక్స్‌గ్రేసీయా అందించాలని తెలియజేశారు.. ప్రస్తుతం తమ ఉద్యమం శాంతియుత నిరసన ద్వారా తెలియజేస్తూ ధర్నా చేస్తున్నామని, న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే, ఉద్యమం తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు .తమ సేవలు కరోనా లాంటి విపత్కర సమయంలో ఎంతోమంది ప్రాణాలు తెగించి ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలు అందించామన్నారు.ఆ సమయంలో తోటి సిబ్బంది చాలామంది ప్రాణాలు త్యాగం చేశారన్నారు . కానీ, వారి కుటుంబాలకు ఎటువంటి భరోసా, కానీ ఆర్థిక న్యాయం కానీ ఆ కుటుంబాలకు అందించలేదని తెలియ జేశారు . ప్రస్తుతం ఉన్నపరిస్థితులను బట్టి తమకు ఇచ్చే వేతనం ఏ స్థాయిలో కూడా ఒక్క కుటుంబం జీవించడానికి అసలు సరిపోదని .దీనిని దృష్టిలో పెట్టుకొని పాలిస్తున్న ప్రభుత్వాలు ఒక్కసారి అలోచించాలని కోరారు . ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు,హెల్త్ పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

టీ మీడియా, అక్టోబర్ 10 ముదిగొండ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ శనివారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 07.10.2026న అయ్యగారిపల్లె గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొడ్డు జ్యోతి (46, భర్త సైదులు) అనే మహిళను ఒక ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడటంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆమె ఆరోగ్యం విషమించి ప్రాణాలు కోల్పోయారు. మృతురాలి కుమారుడు గోపీచంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముదిగొండ ఇన్స్పెక్టర్ గారి ఆదేశాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



టీ మీడియా, అక్టోబర్ 10 పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి అమావాస్యకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని అయ్యప్ప ఆలయ అన్నదాన కమిటి సభ్యులు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ దంపతుల చేతుల మీదుగా ప్రారంభం చేశారు ఈ కార్యక్రమంలో ముత్తు గురుస్వామి వడ్డే ఈశ్వర్ గౌని వేమారెడ్డి ఎల్లారెడ్డి బసాల వెంకటేశ్వర్ రెడ్డి పున్న శ్రీనివాసులు మంగరాయి మన్యం శంకర్ నాయుడు శివసాయి షకీల్ వీరబొజ్జా చారి అయ్యప్ప స్వామి అన్నదాన కమిటి అధ్యక్షుడు కర్నాటి శ్రీను సేవకుల కిషోర్ మధు వేణు ఆర్ట్స్ గొడుగు శాంతన్న అర్ ఎన్ ఆర్ కిట్టు స్వామి వడ్డే రమేష్ నాయకి నారాయణ టీచర్ మోహన్ చిన్న రాములు అయ్యప్ప మాల ధారణ భక్తులు ఆలయ పూజారి తదితరులు హాజరయ్యారు


జ్ఞానేష్ కుమార్ బొమ్మ దగ్ధం



టీ.మీడియా,అక్టోబర్10,చింతూరు:భారతదేశ ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించి, ఓటు హక్కును పరిహాసం చేసిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చింతూరులో సిపిఎం కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం చేసారు . ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అహ్మద్ అలీ మాట్లాడుతూ భారతదేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థ అత్యంత కీలకమైనదని . ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు . రాష్ట్రపతి, ఉన్నత న్యాయస్థానాలు జ్యోతిష్యం చేసుకొని ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలియజేయడం పౌరుల హక్కుగా గుర్తించి అక్రమాలకు పాల్పడిన జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సీసం సురేష్, చింతా రాంబాబు, రాజేష్, పెద్ద రాములు, లక్ష్మయ్య, సంతోష్, రవీంద్ర కాంగ్రెస్ నాయకులు జవహర్, నరేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జనసేన కో ఆర్డినేషన్ కమిటీలో చింతూరు నేతలు






టీ మీడియా , అక్టోబర్10, చింతూరు:రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం జనసేన పార్టీ ఏర్పాటు చేసిన ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీలో చింతూరు మండలానికి చెందిన నలుగురు నాయకులకు చోటు లభించింది. బేడే సతీష్, తీగల రవి, తీగల కవిత, పయ్యాల నాగేశ్వరరావులను కమిటీ సభ్యులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అవసరమైన కార్యాచరణ రూపొందించడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం సాధించడం, అభ్యర్థుల ఎంపికలో సహకరించడం, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం వంటి అంశాల్లో ఈ కమిటీ కీలకంగా వ్యవహరించనుంది. చింతూరు మండలానికి చెందిన నలుగురు నాయకులకు ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీలో అవకాశం కల్పించడంపై మండలంలోని జనసైనికులు, పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నలుగురు నాయకులకు అభినందనలు తెలియజేస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి జనసేన పార్టీ విజయానికి తోడ్పడాలని ఆకాంక్షించారు.





సింగరేణి మండలానికి ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ కమిటీ మంజూరు



•ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కృషి హర్షణీయం

•రైతుల ఆకాంక్షను నెరవేర్చిన ఎమ్మెల్యే అంటూ ప్రజల ప్రశంసలు

టీ మీడియా,అక్టోబర్10,సింగరేణి(కారేపల్లి):వైరా నియోజకవర్గంలోని సింగరేణి మండలానికి ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) మంజూరు కావడం పట్ల మండల రైతులు,ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.సింగరేణి మండలానికి ప్రత్యేక మార్కెట్ కమిటీ సాధించడంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేసిన కృషి హర్షణీయమని ప్రజలు కొనియాడుతున్నారు.రైతుల అవసరాలను గుర్తించి,వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ కమిటీ మంజూరుకు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.మండల అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యతకు ఏఎంసీ మంజూరు నిదర్శనమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.ప్రత్యేక మార్కెట్ కమిటీ ఏర్పాటుతో మండల రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు మార్కెటింగ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రైతులకు ఉపయోగపడే ఇలాంటి నిర్ణయాల కోసం ఎమ్మెల్యే నిరంతరం కృషి చేయడం సంతోషకరమన్నారు.సింగరేణి మండలానికి ప్రత్యేక ఏఎంసీని మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు,దీనికి ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.రైతుల పక్షాన నిలుస్తూ మండల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేను మండల ప్రజలు అభినందించారు.



వర్షాభావ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

టీ మీడియా,అక్టోబర్10, అమరావతి బ్యూరో : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, రాష్ట్రంలో వ్యవసాయం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రానున్న ఆరు నెలల పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, తాగునీటి చోరీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

తాగునీటిమళ్లింపుపైకఠిన చర్యలు

మంచి నీటిని కేవలం తాగేందుకు మాత్రమే ఉపయోగించాలని, ఇతర అవసరాలకు గానీ, చేపలు, రొయ్యల చెరువులకు గానీ మళ్లించకుండా కఠిన నిఘా ఉంచాలని సీఎస్ ఆదేశించారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే తక్షణమే వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రానున్న ఆరు నెలల కాలం అత్యంత కీలకమైనదని, తాగునీటి సరఫరాపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శులు ప్రస్తుత తాగునీటి పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించామని, ఆయా చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు సీఎస్ వివరించారు.



రీసర్వే, గృహనిర్మాణాలవేగవంతం


తాగునీటితో పాటు రాష్ట్రంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను సీఎస్ సమీక్షించారు. రీసర్వే వివిధ దశల్లో ఉందని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త పథకాల కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు త్వరగా ఇళ్లు అందేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.

సంజీవని ఆరోగ్య సేవలకు సన్నద్ధం

రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న 'సంజీవని' ఆరోగ్య సేవల పరిధిని విస్తరించడానికి అన్ని జిల్లాలు సన్నద్ధం కావాలని సీఎస్ పిలుపునిచ్చారు. ఈ వైద్య సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మందులు, సిబ్బందిని ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను, కలెక్టర్లను ఆదేశించారు

దొంగోడు దోచుకుంటే

• వీళ్లు పంచుకున్నారు..



టీ మీడియా,అక్టోబర్10, హైదరాబాద్ బ్యూరో దొంగల నుంచి దోచుకున్న సొత్తును తిరిగి రాబట్టాల్సిన పోలీసులే.. చేతివాటం ప్రదర్శించారు. నేరస్తుల నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించాల్సిన పోలీసులే అక్రమాలకు పాల్పడ్డారు. బాధితులకు చెందాల్సిన సొమ్ములో పోలీసులు కక్కుర్తి, చేతివాటానికి పాల్పడడం కలకలం రేపుతుంది. పోలీస్ శాఖలో హాట్‌టాపిక్‌గా మారిన ఈ ఘటన ఎక్కడ జరిగిందో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెంకు చెందిన అలుగుబెల్లి రాము తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడేవాడు. నార్కట్‌పల్లి, నల్లగొండతో పాటు హైదరాబాద్‌లోని పోచారం ప్రాంతంలోనూ అతనిపై దొంగతనం కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల దర్యాప్తులో భాగంగా గత నెల 2న నల్గొండ డీఎస్పీ శివరాంరెడ్డి, నార్కట్ పల్లి ఎస్సై విష్ణుమూర్తిలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రామును అరెస్టు చేయడంతో పాటు అతని నుంచి రూ.19.20 లక్షల విలువైన బంగారం, రూ. 2.50 లక్షల నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు.అయితే.. ఈ వ్యవహారంలో పోలీసుల గోల్ మాల్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. 9 తులాల బంగారం, రూ.4 లక్షల మేర నగదు నిల్వలు తక్కువగా చూపెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో పోలీసు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. రికవరీ సొమ్ములో చేతివాటానికి పాల్పడ్డాడనే ఆరోపణలతో నార్కట్ పల్లి ఎస్సై విష్ణుమూర్తిని జిల్లా పోలీస్ కార్యాలయానికి ఉన్నతాధికారులు అటాచ్ చేశారు. పక్కదారి పట్టించిన సొమ్ములో ఇతర పోలీస్ అధికారులకు కూడా కొంత వాటా ముట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో సిఐ సురేష్ కు చార్జీ మెమో, నల్గొండ డిఎస్పి శివరామిరెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు.నేరస్తులను పట్టుకోవడం పోలీసుల బాధ్యత అయితే.. స్వాధీనం చేసుకున్న సొత్తును పారదర్శకంగా భద్రపరచడం కూడా అంతే కీలకం. రికవరీలో తేడాలపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని కొట్టిపారేయడం కాదు.. ఆధారాలతో నిజానిజాలు వెల్లడించడమే ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టే మార్గమని పలువురు పేర్కొంటున్నారు..

భగ్గుమంటున్న రాజకీయ కక్షలు

• బతుకమ్మ తల్లి విగ్రహం ధ్వంసం!



టీ మీడియా,అక్టోబర్10, మహబూబాబాద్ : తెలంగాణ ఆత్మగౌరవ గౌరవ ప్రతీక.. ఆడబిడ్డలకు అత్యంత ప్రీతికరమైన వేడుక.. బతుకమ్మ సంబరాలకు ఆడబిడ్డలంతా సిద్ధమవుతున్న వేళ మహబూబాబాద్ జిల్లాలో జరిగిన ఓ దారుణ సంఘటన అందరినీ ఆగ్రహానికి గురిచేస్తుంది. రాజకీయ కక్షలతో బతుకమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేశారు గుర్తుతెలియని దుండగులు. బండరాళ్లతో తల్లి బిడ్డల బతుకమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ ఉన్మాద చర్య పట్ల ఊరంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్ల గ్రామంలో జరిగింది. గ్రామ శివారులో ప్రతియేటా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం కోసం గ్రామ సర్పంచ్ మంజుల రవి బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం వద్దకు చేరుకొని బతుకమ్మ సంబరాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా కొనసాగుతోంది.అయితే గ్రామంలో భగ్గుమంటున్న రాజకీయ కక్షలతో బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ధ్వంసం చేశారు గుర్తుతెలియని ఉన్మాదులు. సర్పంచ్ కుటుంబంపై ఉన్న కోపమంతా ఆడబిడ్డల అస్తిత్వం పై చూపారు. విగ్రహాన్ని రూపం కోల్పోయేలా బండరాళ్లతో కొట్టి ధ్వంసం చేశారు.తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలంతా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు సిద్ధమవుతున్న వేల ఈ ఘటన అందరినీ ఆగ్రహానికి గురి చేస్తుంది. ఇది తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవంపై జరిగిన దాడి అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహంతో పాటు కిందభాగంలో గ్రామ సర్పంచ్ మంజుల రవి పేరుతో ఉన్న శిలాఫలకాన్ని పగలగొట్టారు ఆ దుండగులు. బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ధ్వందంచేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



టీ మీడియా,అక్టోబర్10, దమ్మపేట : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ దమ్మపేట పోలీస్ స్టేషన్ ను శనివారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి,అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు. ఆధునిక సాంకేతిక వ్యవస్థ పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై అందరికీ అవగాహన కలిగి ఉండాలని పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలోని క్రైమ్ ప్రాపర్టీని పరిశీలించి వాటి భద్రత, నిర్వాహణ పై అధికారులకు పలు సూచనలు చేశారు.

కరవు మండలాలను గుర్తించండి’

- కలెక్టర్లకు కీలక ఆదేశాలు

టీ మీడియా,అక్టోబర్10, హైదరాబాద్ బ్యూరో : రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. మంత్రులతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వర్షాభావ ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగు నీరు, పెరిగిన విద్యుత్ డిమాండ్, తాగునీటి సరఫరా తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

అఖిలపక్ష సమావేశంపైనాఇటీవల జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో సాధారణం కన్నా 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నట్లు కూడా సర్కారు అంచనా వేస్తోంది. కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయాన్ని అందించాలని ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ. 20 వేల కోట్ల



స్పెషల్ ప్యాకేజీని కేటాయించాలని కూడా కోరింది. ఈ క్రమంలో వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే కేబినెట్ సబ్? కమిటీ రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, పలు రంగాలకు చెందిన నిపుణుల సలహాలు, సూచనలపై రేవంత్ రెడ్డి నిర్వహించనున్న సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం కనిపిస్తోంది.

ప్రాథమిక నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశం

క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసి, కరవు ప్రభావిత మండలాలపై ప్రాథమిక నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎస్? సంజయ్ జాజు ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై సమీక్షించేందుకు శుక్రవారం సెక్రటేరియట్?లో ఉన్నతాధికారులతో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో సమావేశమైన అనంతరం సచివాలయం నుంచి శాస్త్రవేత్తలు, అధికారులతో వీడియో సమావేశం నిర్వహిస్తారని, అందులో రైతు వేదికల ద్వారా రైతులు పాల్గొంటారని జిల్లా కలెక్టర్లకు తెలిపారు.

ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి

వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్? జాజు అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. లోటు వర్షపాతం కారణంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి, వచ్చే ఏడాది మధ్యకాలం వరకు కొనసాగేందుకు అవకాశముందని తెలిపారు. ఈ ప్రతికూల పరిస్థితుల ప్రభావం నుంచి రైతులను కాపాడేందుకు పంటల వైవిధ్యం, ముందస్తు ప్రణాళికలు చాలా అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా జిల్లాల్లో కరవు ప్రభావిత మండలాలను గుర్తిస్తూ ప్రాథమిక నివేదికలను సమర్పించాలని సూచించారు.

మీటర్ల ఎత్తుంటే ఫైర్ టవర్ ఉండాల్సిందే

ఎన్ వోసీల నిబంధనల్లో కీలక మార్పులు

టీ మీడియా,అక్టోబర్10, హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక, ఎమర్జెన్సీ సర్వీసెస్, పౌర రక్షణ శాఖ తాత్కాలిక అగ్నిమాపక నిరభ్యంతర ధ్రువపత్రాల (ఎన్?వోసీ) జారీకి సంబంధించిన నిబంధనల్లో కీలక సవరణలు చేపట్టింది. గత నెల 21న పురపాలక శాఖ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుకు అనుగుణంగా ఈ సవరణలు అమలు చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా ఆ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్?సింగ్ ?మాన్ గత నెల 23న భారతీయ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ల సమాఖ్య (క్రెడాయ్), జాతీయ రియల్ ఎస్టేట్ అభివృద్ధి మండలి (నరెడ్కో)తో పాటు తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సహా ప్రముఖ నిర్మాణ పరిశ్రమ సంఘాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపారు.

తాత్కాలిక ఫైర్ ఎన్?వోసీలపై ప్రధాన దృష్టి

భవనాల ఎత్తు, ఫైర్ టవర్లు, ఫైర్ కమాండ్ సెంటర్లు, బేస్‌మెంట్లలోని జనరేటర్ గదులకు వెంటిలేషన్ ఏర్పాట్ల లాంటి పలు అగ్ని, ప్రాణ భద్రతా నిబంధనలు అమలు చేయడంలో ఎదురయ్యే ఆచరణాత్మక సవాళ్లపై డైరెక్టర్ జనరల్ విక్రమ్?సింగ్ ?మాన్ విస్తృతంగా చర్చించారు. అనంతరం సవరించిన నిబంధనలు జారీ చేశారు. టెంపరరీ ఫైర్ ఎన్?వోసీల కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలించేటప్పుడు అగ్ని, ప్రాణ భద్రతా చర్యలను అమలు చేయడానికి స్పష్టమైన, ఏకరీతి, ఆచరణాత్మక విధానాన్ని ఏర్పాటు చేయడమే ఈ సవరణల ప్రధాన లక్ష్యమని ఆయన వెల్లడించారు. కొత్త



నిబంధనలు ఈ నెల 7వ తేదీ నుంచే అమల్లోకి వచ్చాయని ఆయన స్పష్టం చేశారు.

సవరించిన నిబంధనలు ఇవే

గతంలో 18 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న అపార్ట్‌మెంట్ భవనాలకు ఫైర్ నిరభ్యంతర ధ్రువపత్రం పొందడం తప్పనిసరి. అయితే తాజాగా ఈ పరిమితిని 24 మీటర్లకు పెంచారు. ఇతర రకాల భవనాల నిబంధనల్లో ఎలాంటి మార్పులు లేవు.

24 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న ఏ భవనానికైనా దాని వినియోగంతో సంబంధం లేకుండా ఫైర్ టవర్, ఫైర్ కమాండ్ సెంటర్ రూమ్? ఏర్పాటు చేయడం తప్పనిసరి.

బేస్‌మెంట్లలో ఉన్న డీజిల్ జనరేటర్ గదుల వెంటిలేషన్‌కు సంబంధించి ప్రత్యేకంగా నిర్దిష్ట సవరణలు చేశారు. కనీసం ఒక మీటరు ఎత్తు ఉన్న అగ్ని నిరోధక గోడ పైన లూవర్లను ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చారు. అయితే ఈ గోడలు కచ్చితంగా రెండు గంటల పాటు మంటలను ఆపగలిగే సామర్థ్యం ఉండాలి.

రూ.30 వేలకు బాలిక అమ్మకం

చిన్న క్లూతో బయటపడ్డ పెద్ద యవ్వారం

టీ మీడియా,అక్టోబర్10, హైదరాబాద్: నగరంలో మైనర్ బాలికను అపహరించి, వ్యభిచార గృహానికి తరలించి లైంగిక దోపిడీకి గురిచేశారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ కేసులో టోలిచౌకి పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. బాలికను ఒకరి నుంచి మరొకరికి అప్పగిస్తూ, ఇందుకోసం రూ.30 వేల నగదు చేతులు మారినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



ఆటోలో బాలికను అపహరించిన దుండగులు!

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 2న షేక్ అతీఫ్ అనే వ్యక్తి మైనర్ బాలికను ఆటోలో టోలిచౌకి నుంచి అత్తాపూర్‌కు తీసుకెళ్లినట్లు ఆరోపణలున్నాయి. అక్కడ సనా, సమ్రీన్ అనే మహిళలకు బాలికను అప్పగించినట్లు కేసు వివరాలు వెల్లడిస్తున్నాయి. అనంతరం అత్తాపూర్‌లో పిల్లర్ నంబర్ 200 సమీపంలోని వ్యభిచార గృహ నిర్వాహకురాలు సబియా బేగంకు బాలికను అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.ఈ వ్యవహారంలో రూ.30 వేల నగదు చేతులు మారినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. బాలికను బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టి, పలువురితో లైంగిక దోపిడీకి గురిచేసినట్లు నిందితులపై కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో కస్టమర్లకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ముగ్గురి పాత్రపైనా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తప్పించుకుని ఇంటికి చేరిన బాలిక!

అక్టోబర్ 5వ తేదీన బాలిక అక్కడి నుంచి తప్పించుకుని ఇంటికి చేరింది. జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు వివరించడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టోలిచౌకి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో షేక్ అతీఫ్, సబియా బేగం, మహమ్మద్ హజీమియా, అఫ్రీన్ అలియాస్ సనా, సమ్రీన్ బేగం, మహమ్మద్ నదీమ్, మహమ్మద్ కైఫుద్దీన్, అలీ బిన్ అక్రమ్‌లను అక్టోబర్ 9న అరెస్టు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచారు. మైనర్ బాలికపై జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ నేరంలో ఇతరుల పాత్రపై కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

కెనడా మేయర్ బరిలో తెలుగు అమ్మాయి బాలీవుడ్ పాటతో ఓట్ల వేట!



టీ మీడియా,అక్టోబర్10, కెనడా: విదేశీ గడ్డపై తెలుగు మహిళ రాజకీయంగా మరోసారి వార్తల్లో నిలిచారు. కెనడాలోని మిస్సిస్సాగా నగర మేయర్ పదవికి పోటీ చేస్తున్న దీపికా దామెర్ల తనదైన ప్రచార శైలితో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బాలీవుడ్ పాటను సరదాగా మార్చి పాడుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఆమె ప్రచార వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

బాలీవ్ పాటతో వినూత్న ప్రచారం

మిస్సిస్సాగా మేయర్ పదవికి పోటీ చేస్తున్న దీపికా దామెర్ల.. ఇటీవల జరిగిన మేయర్ అభ్యర్థుల చర్చ అనంతరం ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ‘వాడివేడిగా సాగిన మేయర్ డిబేట్ తర్వాత.. కాస్త ఉపశమనం కోసం..’ అనే క్యాప్షన్‌తో ఈ వీడియోను షేర్ చేశారు. ఇందులో బాలీవుడ్ సూపర్‌హిట్ పాట ‘క్యా హువా తేరా వాదా’ స్ఫూర్తితో పదాలను మార్చి పాడారు.తాను మేయర్‌గా ఎన్నికైతే ఆస్తి పన్నులు పెంచబోననే హామీని పాట రూపంలో వినిపించారు. తన మాట, ప్రమాణం, కోరిక ఇదేనంటూ సరదాగా సాగిన ఈ ప్రచారం నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ఎన్నికల ప్రచారంలో సాధారణ ప్రసంగాలకు భిన్నంగా సంగీతాన్ని ఉపయోగించడం ద్వారా ఓటర్లకు తన సందేశాన్ని చేరవేసే ప్రయత్నం చేశారు. అయితే, ఆస్తి పన్నులపై ఆమె చేసిన హామీ ఎన్నికల ప్రచారంలో భాగమైన అంశం మాత్రమే.

ఎవరీ దీపికా దామెర్ల?

దీపికా దామెర్ల తెలంగాణలోని సికింద్రాబాద్‌లో జన్మించారు. ఆమె తండ్రి భారత సైన్యంలో పనిచేశారు. అండర్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అనంతరం 1991లో కెనడాకు వెళ్లారు. టొరంటో విశ్వవిద్యాలయానికి చెందిన రొట్మాన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. అనంతరం కెనడాలోని ప్రముఖ బ్యాంకుల్లో కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. టీవీ జర్నలిస్టుగానూ సేవలందించారు.

కౌన్సిలర్ నుంచి మేయర్ అభ్యర్థి వరకు

దీపికా దామెర్ల రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత మిస్సిస్సాగా నగరంలోని ఏడో వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. అంతకుముందు ఒంటారియో ప్రావిన్స్ ప్రభుత్వంలో ఆరోగ్య, దీర్ఘకాలిక సంరక్షణ విభాగానికి సంబంధించిన బాధ్యతలు కూడా నిర్వహించారు. ఇప్పుడు మేయర్ పదవికి పోటీ చేస్తూ తన ప్రచారంతో వార్తల్లో నిలుస్తున్నారు.గతంలో న్యూయార్క్ మేయర్ ఎన్నికల సందర్భంగా జొహ్రాన్ మమ్దానీ కూడా వినూత్న ప్రచార శైలితో దృష్టిని ఆకర్షించారు. ఇప్పుడు దీపికా దామెర్ల బాలీవుడ్ పాటను ఉపయోగించడంతో ఆమె ప్రచార వీడియోకు మరింత ప్రాచుర్యం లభిస్తోంది. మేయర్ ఎన్నికల్లో ఆమెకు ఓటర్లు ఏ మేరకు మద్దతు ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది.

స్మార్ట్ కిడ్జ్ లో హోరెత్తిన బతుకమ్మ సంబరాలు

- **తీరొక్క పూల తో ఆడి పాడిన పాఠశాల చిన్నారులు**



టీ మీడియా,అక్టోబర్10, ఖమ్మం: స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు హోరెత్తాయి. పాఠశాల చిన్నారులు తమ తమ గృహాల నుంచి తీరొక్క రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ఆ బతుకమ్మలతో పాఠశాల మైదానానికి చేరుకున్నారు. పాఠశాల చిన్నారులు బతుకమ్మలన్నింటినీ పాఠశాల మైదానంలో ఉంచి బతుకమ్మల చుట్టూ వలయాకారంలో చప్పట్లు, తాళాలతో జానపద గేయాలతో నృత్యాలు చేస్తూ ఆడి పాడారు. బతకమ్మ బతకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. పాటలతో పాఠశాల ప్రాంగణం అంతా హోరెత్తింది. ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకి బతుకమ్మ, నెలవంక, తులసి కోట బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తొలుత గౌరీ మాతకు పాఠశాల చిన్నారులు ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ సంబరాలను ఆనందోత్సవాలతో నిర్వహించారు. అదేవిధంగా పాఠశాలల్లో దసరా వేడుకలను వైభవంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అమ్మవారికి మంగళకరంగా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రావణ దహన ఉత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఆడపడుచులు, చెరువులు, ప్రకృతి మాత విశిష్టతను చాటిచెప్తూ, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ, నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు ప్రపంచవ్యాప్తంగా మన తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నాయని తెలిపారు. పాఠశాలలో ప్రకృతి వైభవాన్ని చాటి చెప్పేందుకు, ప్రకృతిని రక్షిస్తేనే మన మనుగడ నిరంతరాయంగా వర్ధిల్లుతున్నదనే సందేశాన్ని చాటి చెప్పేందుకు పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను వేడుకగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికి బతుకమ్మ సంబరాల శుభాకాంక్షలు, దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

